
# అమ్మమ్మ ముద్దు



వర్చస్వి ఎల్. పుచ్చా

కాశీ విశాలాక్షమ్మ పదునైన తనదైన చూపు చూసింది బాబిగాణ్ణి. బాబిగాడి పై ప్రాణాలు పైపైనే పోయినట్లనిపించినయ్!! ఆ చూపు ఒక్కటి చాలు! చెట్టుకు కట్టేసి చావ చితక్కొట్టక్కర్లేదు! తోలు బెల్టు తీసి వీపు మీద వాతలు తేలేలా కొట్టఖ్ఖర్లేదు! ఒక్క పదునైన చూపు.........! అంతే!! చాలంటే చాలు! నిలువునా భస్మం చేసిపారేస్తుందేమో అనేలా చూపు! మానసికంగా శాశ్వతంగా అవిటివాణ్ణి చేసే చూపు!! బాబి వయసు కేవలం తొమ్మిది సంవత్సరాలు.

"వంటి మీదకి ఏళ్లొస్తున్నా బుద్ధి పెరగటంలేదు." అంటుంది కాశీ విశాలాక్షమ్మ చాలాసార్లు.

----అది బాబిగాడికి వయసుకు మించి ఎంతో పెద్దరికం వంటబట్టేలా చేసింది!

"ఎద్దులా తిండి తినటం! మొద్దు నిద్దరపోవడం " అనేది కొన్ని సార్లు.

---అది పట్టెడన్నం తినడం కూడా మహాపాపం అనే నైజాన్ని అలవర్చుకునేలా చేసింది!!

".....మీ అయ్యతో పాటే అడుక్కు తిందువుగానీ. పెద్దవాళ్ళ మాట వినకపోతే" అనేది ఒకొక్కప్పుడు.

--అది తండ్రంటే పరమ కిరాతకుడూ, పనికిమాలినవాడూ అనే బీజం నాటేలా చేసింది.

ఇలా ఎన్నో! ఎన్నెన్నో!!

ఇలా అంటున్న ప్రతిసారీ కాశీ విశాలాక్షమ్మ పదును చూపులు బాబిగాడి గుండెల్లో గునపాలు దింపేవి. విచిత్రమైన విషయం ఏమిటంటే సాధారణంగా ఇలా గుండెల్లో గునపాలు గుచ్చే సదరు పదును చూపులు పక్కనున్న లేదా చుట్టు ప్రక్కల ఉన్న ఎవరికీ కనబడకుండా వుండేలా చేసుకునేది విశాలాక్షమ్మ. ఎంత జనసందోహంలో



ఉన్నా సరే ఆ పదును చూపులు అన్నింటినీ తప్పుకుని వచ్చి సూటిగా బాబిగాడి గుండెల్ని గుచ్చుకుని తీరాల్సిందే! ఈ రోజు ఆవిడని సంప్రదించకుండా - పక్క వాటాలో ఉన్న వాళ్ళకి వైరింగ్ పనులకి అవసరమొస్తే - ఒక పాడవాటి ముక్కాలిపీట ఇచ్చాడు. బాబిగాడు స్వతంత్రించి!

అదీ సంగతి!! అందుకే ఆవిడగారి ఆ పదునైన చూపులు బాబిగాడి మీద! వాడికి చమటలు పట్టినయ్ ఒక్కసారిగా - వేలాది సూదుల మొనలతో లిప్తకాలం పాటు గుచ్చి తీసేసిన అనుభూతి! ఇక ఏ మాత్రం ఆ చూపులు భరించలేక తలదించుకు కాలి బొటనవేలుతో నేలను వ్రాస్తూ వుండిపోయాడు. కాలి క్రింద నేల ఊగిపోతూ జారిపోతున్నట్టనిపించితే పక్కగా వున్న వడ్లబస్తాలకి ఆనుకున్నాడు. ఒకటి రెండు ఎఱ్ఱచీమలు వంటిమీదకి పాకి కుడుతున్నట్లున్నయ్! ! అయినా బాధ అందుకు కాదు! తల ఎత్తి ఆవిడ ముఖంలోకి చూసి కొనితెచ్చుకునే ఆ సూది చూపుల బాధకన్నా ఇది ఎన్నో రెట్లు తక్కువ. కానంతలోనే - "ఏం? ఈవిడేమన్నా చంపి అవతల పారేయలేదుగదా....?" అని ధైర్యంగా తన్ని తానే అడుక్కున్నాడు.

అప్పటికే 'విప్లవం' - మాట విని ఉన్నాడు. దానర్థం సరిగా తెలీదు వాడికి - కానీ - ఏదో ఆక్రోశం లాంటిది కల్గినప్పుడు కించిత్ ప్రతిఘటించడం లాంటిది అని అనుకునేవాడు.

అర్థధీ!

విప్లవాత్మకంగా - హేతుబద్ధంగా ప్రశ్నించుకుంటున్న చిన్న ప్రశ్న అది.!

తన్ని తానే ప్రశ్నించుకుంటున్నాడు గాబట్టి ఫర్వాలేదు. ఎవ్వరూ ఆక్షేపించరు. ఎవ్వరూ కొట్టరు. ముఖ్యంగా "విశాలాక్షి అమ్మమ్మ" గారు అసలు కొట్టరు. "ఏం? మరెందుకు అంత వణికిపోవడం? ముక్కాలిపీట అవసరార్థం ఇస్తే ఇంత రాద్ధాంతం దేనికి? కరిగిపోతుందా? తరిగిపోతుందా? ఒట్టి చుప్పనాతి తనం కాకపోతే?" అంటూ మళ్ళీ విప్లవ - హేతుపూరిత ప్రశ్న వేసుకున్నాడు బాబిగాడు.

"చంపుతావా?"

"గెంటుతారా?"

"తన్ని తగలేస్తుందా?"

"వాత పెడుతుందా?"

"బడి మాన్పిస్తుందా?"

"అమ్మతో చెప్పి కొట్టిస్తుందా?"

"బావిలో నీళ్ళు తోడి, అంట్లన్ని తోమి, పెరడు బాగు చేసి, గేదెల్ని కడగమంటుందా?"

లేదు!

లేదు!!

లేదు!!!

ఇవేమీ కావు. ఇవన్నీ అయితే అంత బాధపడటం దేనికి?

సరదాగా ఆపన్లు చేయొచ్చుగా! పదునైన చూపులు వదుల్చుకోవచ్చుగా!!

ఇంకేం అనదు! సింపుల్‌గా----

"మీ 'అయ్య' సంపాయించిన ఆస్తి గాదు" అంటుంది. లేదా "మీ 'అయ్య' పోలికలు వచ్చి బలాదూర్ చేస్తే అడుక్కుతింటానికి కూడా పనికిరావ్" అంటుంది. ఎంత పవర్‌ఫుల్ డైలాగులు.... ?

"అమ్మా? అమ్మమ్మ కెందుకు నేనంటే అంత కోపం? ఊర్కే విసుక్కుంటుంది?"

అడిగాడు బాబి వాళ్ళమ్మ వర్ధనిని భయభయంగా.

"నోర్ముయ్! అమ్మమ్మని పట్టుకుని అంతమాట అంటావా! నిజంచెప్పు! కనీసం నీమీద ఎప్పుడైనా చెయ్యి చేసుకుందా? కనీసం కళ్ళెర్ర జేసిందా?" అంది వర్ధని.

నిజంగా ఎప్పుడూ కొట్టనేలేదు.

కానీ ఆ చూపులే....... భస్మం చేసేలా చూపులు!! "నాకదేం తెలీదు. బడి కాగానే అటునుండి అటు ఆఫీసుకు వచ్చేస్తా! ఒక్కణ్ణే మటుకు ఇంటికి రాను. కావాలంటే నువ్వొచ్చింతర్వాతే బావిలో నీళ్ళు తోడుతా. అంతేగానీ..........మరేమో...... మరేమో....... ముందే ఇంటికి వచ్చి....... మాటలు పడను........" అన్నాడు బాబిగాడు ఉదాసీనంగా. వర్ధనికి వీడి మాటలేం ఒక్కటి కూడా అర్థం కాలేదు. "........ అన్ని 'అయ్య' బుద్ధులే, ఛీ! ఛీ! నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యి. బాగు పడుదూగానీ' ' అంటూ అక్కడినుండి లేచి వెళ్ళిపోయింది వర్ధని. బాబిగాడు ఇంకేం మాట్లాడదల్చుకోలేదు. ముందు ఎంతో జీవితం ఉంది. కానీ ముసలి వాడయిపోయి విరక్తి - వైరాగ్యం పెంచుకున్నవాడిలా ఉంది వాడి పరిస్థితి.

తను అందరి పిల్లలతోటివాడు కాదా? తనింకెవరితో చెప్పుకుంటాడు? నాన్న.... అదే..... 'అయ్య' ఎక్కడో ఉన్నాట్ట. అసలు 'నాన్న' 'అయ్య' ఎలా అయ్యాడు? అస్తమానూ తాగి ఎక్కడెక్కడో తిరుగుతాట్ట! విశాలాక్షమ్మ ఎదురింటి కాత్యాయనమ్మతో ఓసారి అంటుంటే విన్నాడు. 'అందుకని ఆ వెధవతో ఏం పని? ........ అని- అమ్మాయినీ - పిల్లాడ్నీ ఇక్కడే ఉంచి పోషిస్తున్నా' అని చెప్పడం కూడా విన్నాడు. మరో సందర్భంలో. "......సంసారంలో .......భార్యాభర్తలు కాడికి రెండు ప్రక్కలా ఎద్దులు! ఏ ఒకటి లేకపోయినా పని జరుగదు" లాంటి ఎన్నో 'కొటేషన్స్' జాగ్రత్తగా వినేవాడు బాబిగాడు.

అంటే ఒక ఎద్దుని అసలు తను చూడలేదు. ఎప్పుడో చూసినా ప్రస్తుతం ఉండీ లేనట్టే! అన్ని సంసారాల్లా కాదు, తన సంసారం..... బ్రతుకూనూ!

"మీ వాడు చదువులో చాలా చాకు లాంటివాడు సుమండీ - కాకపోతే కొంచెం పరధ్యాన్నంగా ఉంటాడన్నమాటేగానీ......." పంతులుగారు తన ఎదురుగా తనకిచ్చిన కితాబు:

"గట్టిగా గంట చదివితే ఓపికలేక పడిపోతాడేమో అనేట్టుంటాడు. కాస్త పుష్టిగా తినిపించి వ్యాయామం చేయిస్తుండండి" --పక్కింటి మల్లేశ్వరశాస్త్రి ఉచిత సలహా! "మరిచాను చెప్పడం! మీవాడు హిందీ పాఠాలు గడగడా అప్పచెబుతాడండోయ్! ప్రతి టెస్టులోనూ వాడే ఫస్టంటే నమ్మండి' ' --గుళ్ళో కలిసిన అమ్మకి పలకరింపుగా చెప్పే హిందీ టీచరు!! ఇలాంటి సంఘటనలు తలుచుకుంటే తనకే గర్వంగా ఉండేది. బాబిగాడికి. దాదాపుగా తోటి పిల్లలకన్నా చాలా ఫర్వాలేదనిపించుకునే ప్రవర్తనా నియమావళి తనకుంది. అయినా ఏదో అసంతృప్తి.

ఉదాసీనత!! బేలతనం!! ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్?????????

అందరి పిల్లల్లా తనకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేవా?

అందరి పిల్లల్లా తనకి గోలచేయుటం - గిల్లికజ్జా లాడటం తగవా?

అందరి పిల్లల్లా తనకి పాలబుగ్గలు లేవా?

మరెందుకు అందరి అమ్మమ్మల్లా తన అమ్మమ్మ తనని ముద్దు పెట్టుకోదు?

హమ్మో! --- ముద్దే -- మొట్టికాయ వేయకుంటేనే చాలు! మరి మామయ్య కొడుకు గోపిగాణ్ణి, పెద్దమ్మ కూతుళ్లు మల్లీ, బేబీలని ఎలా ముద్దుపెట్టుకుంటుంది? వాళ్ళు అందంగా పుష్టిగా ఉంటారా? ఔను తనకన్నా పుష్టీ - కానీ తనేం వికారంగా ఉండడే! ఉంటే ఎదురు మేడ మీద ఆంటీ పదే పదే 'ముద్దుల మా బాబే' అంటూ ఎలా బుగ్గలు పుణికి పుచ్చుకుంటుంది? ఏమో? ఎవరితో చెప్పుకోవాలి? ఏం చేయాలి?

నోరు మూసుకోవాలి

పాటలు పాడద్దు----

మిద్ద మీద శబ్దాలు వినపడేలా గెంతద్దు----

వెనకింటి ఉయ్యాలలో పాపాయికి పాలసీసా పట్టొద్దు--

స్కూలు ఫీజు కట్టాలి అని మొఖా యించొద్దు--

రేడియో అడక్కుండా పెట్టొద్దు--

పుస్తకాలు కుట్టీ కుట్టీ సూదులు విర క్కొట్టొద్దు--

'అయ్యా' పద్ధతులు పాటించొద్దు---

బాబిగాడి ఆలోచనలు తిక్క తిక్కగా సాగి పిచ్చెక్కిస్తున్నాయి. మొత్తానికి బాబిగాడేదో రాజీకొచ్చినట్లు కన్పించాడు. మనసు కుదుట పడింది. ఔను! తనకెవరూ లేరు! తనెవరికీ అక్కర్లేదు. తనందరికీ బరువే! తన కాళ్ళ మీద తను నిలబడేదాకా కష్టాల ఊబే! ఇలా అనుకున్న తర్వాత బాబిగాడికి తన 'బాబుగారు' అన్న ఫీలింగ్ వచ్చింది.

"---వెధవా! ఉండు! నిన్ను మీ అయ్య దగ్గరికే పంపించేస్తానుండు! అప్పుడుగానీ తిక్కకుదరదు' ' అంది 'రౌద్రంగా' మళ్ళీ ఒక రోజు విశాలాక్షమ్మ. బాబిగాడు అటిటాకులా వణికిపోయాడు. అసలేమయిందంటే-

మామయ్య కొడుకు గోపీగాడు పరిగెట్టుకుంటూ వచ్చి మడితో నీళ్ళబిందె తీసుకొస్తున్న విశాలాక్షమ్మని తాకుతూ పోయాడు - వాడి వయస్సు పది పదకొండేళ్ళుంటాయ్!

ఇదివరలో ఇలాంటిది జరిగినప్పుడు

"పెద్ద వెధవ్వి- వాడికి కాకపోతే నకు బుద్ధుండక్కర్లేదూ" అనేది బాబిగాణ్ణే ఎదురు, నిజానికి వయసుకో చిన్నవాడైనా కూడా! ఇప్పుడలా అనలేదు. "సాయంత్రం మీ అమ్మరానీ - వాలుగు అంటించమని చెబుతాను?" అని మాత్రం అంది. మళ్ళీ విప్లవం తలెత్తింది బాబి గుండెల్లో!

ప్రశ్నించు!

ప్రశ్నించు!!

ప్రశ్నించు!!!

"వాడు తాకి నీ మడి చెడగొడితే నన్నంటావేమిటి?" అడిగాడు కొంచెం ధైర్యంగానే "మళ్ళీ ప్రశ్నకూడానూ వెధవకి! నోరు లేస్తోందేమిటంటా? నువ్వు ఆటలు నేర్పక పోతేనే వాడు ఆడాడా? నన్ను ఊరికే తగిలి మయిల పరిచాడంటావా??? అని లాపాయింట్ లాగి బాబిగాణ్ణే ముద్దాయిని చేసి ఫామ్మంది. గోపీగాడు కూడా- బాబిగాడు అటు పరిగెట్టరా అంటే ఇటు పరిగెత్తాడు! నేను ఇటువైపు రాక తప్ప లేదు" అన్నాడు తన చేతల్ని.... అదే... పరుగుల్ని సమర్థించుకుంటూ!

ఔను! తనకెవరూ లేరు! తనెవరికీ అక్కర్లేదు! తనందరికీ బరువే! మళ్ళీ క్యాసెట్‌ని 'రిప్లే' చేస్తున్నట్టుగా ప్రతిధ్వనించింది బాబిగాడు హృదయం. అమ్మతో చెప్పకుంటే - "తప్పేముది? అల్లరి చేయొద్దు! చేయించొద్దు!! అంది! ఇందులో నువ్వంతగా రోషపడాల్సిందేముంది?" అంటుందనే విషయం బాబిగాడికి తెల్సు. అందుకే చెప్పదల్చుకోలేదు.

"ఆ విశాలాక్షమ్మ భలే క్రమశిక్షణగా పెంచింది. తన పిల్లల్ని - ఇప్పుడు మనవళ్ళనీ - మనవరాళ్ళనీ కూడా అంతే భయభక్తుల్తో పెంచుతుంది, గొప్ప వ్యక్తి సుమా!" అనుకుంటుంటారు ఇరుగు పొరుగమ్మలు.

"ఆవిడ మనవళ్ళని ముద్దు చేస్తుంది - భయమూ చూపెడుతుంది. అసాధారణ వ్యక్తి" అని చుట్టాల్లోనూ పేరు!

"మామ్మగారూ - మామ్మగారూ మా డాడీ ఇవేళ మంచి బాలల చిత్రం చూపిస్తున్నారు - మీ బాబిగాడు టిక్కెట్టు కూడా డాడీయే తెప్పించారులెండి - వాణ్ణి నాతో పంపించరూ? ప్లీజ్?" అని అడిగాడు బాబి ఫ్రెండ్ ఓ శనివారం సాయంత్రం..

విశాలాక్షమ్మ కొద్ది క్షణాలు ఆలోచించి--

"దాన్దేముంది బాబూ! తప్పక తీసుకెళ్లు నే పంపించేదేముంది?" అంది-

"చూశావా! మీ అమ్మమ్మ ఎంత మంచిదో! మా అమ్మమ్మ ఉంది ఎందుకూ సినిమా అంటె వాతలు పడతా అంటుంది." అన్నాడు బాబి ఫ్రెండ్ మెచ్చుకోలుగా!

పంపించే ముందు బాబిని లోపలికి పిలిచి ఒక సంచీ చేతులో పెడుతూ "ఇవి రెండు కిలోల గోధుమలేరా నాయినా! మీ సినిమా పక్కనేగా పిండిమర! వాడికిస్తే పిండి ఆడించి ఉంచుతాడు - వస్తూ తీసుకురావచ్చు" అంది విశాలాక్షమ్మ. సినిమాకి వెంఠనే ఒప్పుకోగానే ఇలాటిదేదో ఉందని ముందే ఊహించాడు బాబి. సినిమాకి వెడుతూ చేతిలో ఈ గోధుమ సంచీ! ఇంతకన్నా శిక్ష ఏం కావాలి? చాలా వింత వింత శిక్షలు వేస్తుంది. అమ్మమ్మ........ఛీ...... అదే....... విశాలాక్షమ్మ- అనుకుని, పైకిమటుకు "అలాగే" అంటూ సంచి చేతిలోకి తీసుకున్నాడు.

ఆ పూట వర్ధని తల్లితో అంది. "ఎందుకే అలా చిన్నపిల్లల్ని సినిమాలకంటూ అలవాటు చెయ్యటం? చదువు చట్టూ మానేసి?" అంది.

"పోనిద్దూ- పాపం వెళదామని సంబరపడ్డాడు, పిచ్చి వెధవ! అని పొమ్మన్నాను. ఇహ ఇప్పట్లో పోడులే--" అంది విశాలాక్షమ్మ జాలి కురిపించేస్తూ. తన తల్లికి బాబిగాడి మీదున్న అభిమానానికి మురిసిపోయింది వర్ధని.

కొద్దిరోజుల తర్వాత వేసవి సెలవలు వచ్చినయ్! కొడుకూ, పెద్ద కూతురూ ఉత్తర్రాలు వ్రాశారు.

సెలవలకి ఈ సారి పిల్లలు అటు వచ్చేకంటే విశాలాక్షమ్మ అటు వస్తే సరదాగా ఉంటుందని రాశారు. ఇంత వయస్సులో తోడు లేకుండా ఎట్లా పోవడం? 'వెధవలు! రమ్మన్నవాళ్ళు ఎవరో ఒకర్ని ముందు

## ఎండాకాలము

వేసవిలో చల్లదనాన్ని
వెతికి వెతికి విసిగిపోయిన
పుడమితల్లినిరాశతో
నిట్టూర్పయిపోయింది!

బాహ్యప్రపంచాన్ని పట్టించుకోని
విధికృతాంధబధిరులు
ఏసీగదుల్లో బందీలవుతారు!
స్వేదానికి విలువలుండవు

దాహం తీరకనే
నీటిని కక్కుతారందరు!

రాత్రిమేలుకుంటుంది.
పగలునిదురపోతుంది

మామూలు మనిషికి
మహా వృక్షాలు
జోలలుపాడతాయ్!
పక్షులు తమ స్వేఛ్ఛకు

సంకెలలు వేసుకుంటాయ్
ప్రకృతి తన ఉనికిని
వికృతంగా ప్రదర్శించి
మరోసారి నవ్వుకుంటుంది!

---చివుకుల రామేశ్వర్ -అస్రాని-

పంపించి తన్ని తీసికెళ్లేలా చెయ్యొచ్చు గదా' అనుకుంది! బాబిగాడు ఠక్కున మెదిలాడు. వెధవ ఇక్కడ పడివుంటే వాడికి అడ్డూ అదుపూ ఉండదు. పదిరోజులూనూ - వాణ్ణి తీసికెళ్తే సరి. సంచీ, తువాలు లాటివి మోస్తాడు అనుకుంది.

"వస్తావుట్రా నాతోపాటూ?" అంది వాత్సల్యం ధ్వనిస్తూ!

"నీ ఇష్టం అమ్మమ్మా! " అని మాత్రం అనగలిగాడు బాబి. ముందు కూతురింట్లో రెండ్రోజులుండి అటునుంచి కొడుకు దగ్గరికి వెళ్దాం అనుకుంది.

అలాగే ప్రయాణం కట్టి వచ్చారు.

"ఐ........ ఐ......!! బాబిగాడు వచ్చేశాడు" అంటూ కేరింతలు కొట్టింది మల్లి" అరె! ముసలవ్వ కూడా వచ్చేసిందే భలే భలే ముసలవ్వ" అంది మల్లి మళ్ళీ! విశాలాక్షమ్మ మొఖం పాలిపోయింది! పెద్దంతరం చిన్నంతరం లేదూ- ముసలవ్వట ముసలవ్వ!! రెండ్రోజులు కూడా ఎందుకూ? రేపొద్దుటే బండికి కొడుకు దగ్గరికి పోతేసరి- అనుకుంది విశాలాక్షమ్మ. అక్కడి వాతావరణం - పిల్లల వాలకం - అల్లుడు దర్పం అంతా చికాగ్గా అనిపించి అలాగే పొద్దుట బండికి కొడుకు దగ్గరికి వెళ్ళింది.

"వీణ్ణి కూడా తెచ్చుకుని మంచిపనిచేశావే! ఇక్కడ కూడా మీ కోడలికి వంట్లో బావోలేదు. మన ఖర్మకి పనిమనిషి మానేసింది. ఈ పదిరోజులూ నీ ఆలనా పాలనా వాడే చూస్కోవాలి మరి" అన్నాడు కొడుకు వెళ్ళగానే!! విశాలాక్షమ్మకి ఎదోలా ఉంది ఆ మాటలు. పెరట్లో ఓ ప్రక్కగా ఫ్రెండ్స్‌తో 'క్రికెట్' ఆడేస్తున్నాడు గోపిగాడు. తమాయించుకున్న విశాలాక్షమ్మ "నా మనవడు గోపీ ఏడీ?" అంటూ ముందుగా పెరట్లోకి వెళ్ళింది.

"అరేయ్ మా ముసల్దొచ్చిందిరా! ముసల్ది!! హోయ్!! హోయ్!!" అంటూ అరిచాడు గోపీ. విశాలాక్షమ్మ ముఖం మళ్ళీ పాలిపోయింది. ముసల్ది! ముసిల్ది!! ముసిల్ది!!! ఆహా ఏమి ఆహ్వానం? అనుకుంది.


ఇంతలో బంతి వచ్చి ఆవిడ నుదుటి మీద తగిలింది. విశాలాక్షమ్మ బాధతో మూల్గితే "భలే! భలే!! సిక్సర్ కొట్టావ్!! అని చప్పట్లు కొట్టాడు గోపీ. నుదుటిన బంతి తగిలినట్లులేదు విశాలాక్షమ్మకి. గుండెల్లో బలంగా కాలితో తన్నినట్లనిపించింది. ఆ రాత్రి..........

మందుల షాపునుంచి ఆయింట్‌మెంట్ తెచ్చి దెబ్బ మీద మెల్లిగా చేత్తో రాస్తున్నాడు బాబిగాడు విశాలాక్షమ్మ మంచం మీద కూర్చుని....

విశాలాక్షమ్మ సూటిగా బాబిగాడి ముఖంలోకి చూసింది. అలా చూస్తుంటే వరదలుగా బాధ ముంచుకొచ్చింది. కళ్ళలో నీరు చిప్పిల్లింది. దెబ్బ బాధ కాదు అది! ఆనంద బాష్పాలు!! వాడి మొఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకుని ముందుకి లాక్కుంది.

బాబిగాడికి ఊహ తెలిసింతర్వాత విశాలాక్షమ్మ మొదటిసారి వాణ్ణి ముద్దు పెట్టుకుని అంది." మనం రేపొద్దుటే మన ఊరెళ్ళిపోదాం! ఈసారి సెలవలకి మీ 'నాన్న దగ్గరికే వెళదాం!" ●

# తిరుపతిలో చలం




19మే, 1994 తిరుపతిలో చలం శతజయంతి సభలో పి.రాజారెడ్డి, ఫిలోమి నారాయప్ప (శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్), ఎ.చెంగల్‌రెడ్డి (టి.టి.డి. ట్రస్ట్ బోర్డు ఛైర్మన్), భూమన్, ఓల్గా, నర్తకి, డాలీ

మే19న చలం శత జయంతిసభ తిరుపతిలో జరిగింది. టి.టి.డి. ఛైర్మన్ ఆకేపాటి చెంగల్‌రెడ్డి సభని ప్రారంభించారు. చలం నిర్భీకత్వాన్ని, సాహసాన్ని ఆయన ప్రస్తుతించారు. మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సి.ఆర్.రెడ్డి చలం గురించి మాట్లాడుతూ చలం బిడ్డల గురించి పడిన ఆరాటాన్నీ, ప్రేమనీ, ఆత్మీయతనీ కొనియాడారు. ఓల్గా చలం రచనలోని స్త్రీ పురుష సంబంధాలను, కుటుంబ వ్యవస్థనీ శాస్త్రీయంగా విశదీకరించారు. చలం పెంపుడు కూతురు డాలీ, చలాన్ని చివరి వరకు అంటిపెట్టుకుని వున్న నర్తకి ఈ సభకి రావడం ప్రసంగించడం విశేషం. సభకి భూమన్ సంధాన కర్తగా వ్యవహరించారు. ఉత్సవాల కన్వీనర్ పి.రాజారెడ్డి సభని జయప్రదంగా నిర్వహించారు. ●